క్లుప్తంగా

పరిశుభ్రతపై నిర్లక్ష్యం వద్దు



పరిశీలిస్తున్న కమిషనర్ జగదీశ్వర్

నిర్మల్‌టౌన్: పట్టణంలో పరిశుభ్రతను నిర్లక్ష్యం చేయకుండా.. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని గుల్జర్ మసీద్ అనుబంధ ఖబ్రస్తాన్‌లో సిబ్బందితో పిచ్చిమొక్కలు తొలగింపజేశారు. పిచ్చిమొక్కలతో విషపురుగుల సంచారం పెరుగుతుందని పేర్కొన్నారు. తాజా మాజీ కౌన్సిలర్ తౌహీద్ ఉద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దేవిదాస్, సిబ్బంది ఉన్నారు.

బస్సెక్కి హల్‌చల్



బస్సుపై యువకుడు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లిలో ఆర్టీసీ బస్సు ఎక్కి అదే గ్రామానికి చెందిన గుగ్లావత్ శ్రీధర్ అనే మతిస్థిమితం లేని యువకుడు హల్‌చల్ చేశాడు. దీంతో బస్సులోని ప్రయాణికులతోపాటు గ్రామస్తులు హైరానా పడ్డారు. సుమారు గంటపాటు ట్రాఫిక్ నిలిచిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. అనంతరం స్థానికులు సదరు యువకుడిని బస్సు నుంచి కిందికి దింపి కుటుంబసభ్యులకు అప్పగించారు.

గ్రామంలోకి భీమన్న గదలు



గదలతో గ్రామస్తులు

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని భీమన్న ఆలయ గదల ఊరేగింపును మంగళవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 21న భీమన్న జాతర జరుపనున్నారు. ఈసందర్భంగా గ్రామాల్లో భీమన్న గదల ఊరేగింపు వచ్చే సోమవారం వరకు నిర్వహిస్తారు. అనంతరం గోదావరి జలాలతో అభిషేకం చేసి ఆలయానికి తీసుకురానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం విద్యార్థులు బ్లేసినా, మేఘనను ప్రిన్సిపాల్ శకుంతల, సిబ్బంది మంగళవారం అభినందించారు. ఈనెల 13న నిర్మల్‌లో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో వీరు ప్రతిభ చాటి ఈనెల15 నుంచి ఆసిఫాబాద్‌లో జరిగే జోనల్‌స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్‌తోపాటు పీఈటీ సునీత, సిబ్బంది అభినందించారు.

కేజీబీవీ విద్యార్థిని అదృశ్యం

మామడ: మండలకేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదివే ఓ విద్యార్థిని(15) మంగళవారం అదృశ్యమైంది. విద్యార్థిని తరగతులకు గైర్హాజరవడంతో సిబ్బందికి అనుమానం రాగా విచారించారు. ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేజీబీవీ సిబ్బంది ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై మల్లేశ్ తెలిపారు.

తీరిన విద్యుత్ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సిబ్బందితో కాలనీవాసులు

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామంలో కొత్తప్లాట్స్ కాలనీవాసులు ఏళ్లుగా ఎదుర్కొంటున్న లోవోల్టేజ్ విద్యుత్ సమస్య పరిష్కారమైంది. ఇన్‌చార్జి ఏఈఈ రాంసింగ్ చొరవతో మంగళవారం నూతన 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్, మూడు స్తంభాలు ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఎల్ఎం యాదగిరి, సురేందర్ తదితరులు ఉన్నారు.

గుడుంబా అరికట్టాలి

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణ పరిధిలో గుడుంబా విక్రయాలను అధికారులు అరికట్టాలని ఖానాపూర్ వీడీసీ అధ్యక్షుడు సతీష్‌రావు దేశ్‌పాండే అన్నారు. మంగళవా రం పట్టణంలోని ఖానాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక గుడుంబా ప్యాకెట్లను పరిశీలించి సమీపంలో విలేకరులతో మాట్లాడారు. నిత్యం ప్రధాన రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల సమీపంలో గుడుంబా సేవించి యువత అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఇటీవల పలువురు పట్టణ యువకులు గుడుంబా సేవించి మృతి చెందినప్పటికీ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్కారు విద్యార్థులకు కష్టాలు

- బాదన్‌కుర్తి ప్రాథమికోన్నత పాఠశాలలో సౌకర్యాలు కరువు
- పూర్తయిన నూతన భవనం
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక ప్రారంభానికి నోచుకోని వైనం

ఖానాపూర్: సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పాలకులు, అధికారులు హామీ ఇస్తున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో మాత్రం వారి మాటలు నీటి మూటలుగానే మిగులుతున్నాయి. ఖానాపూర్ మండలంలోని బాదనకుర్తి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. దీనిపై కథనం..



అద్దె భవనంలో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ఒకే మూత్రశాల ఉండడంతో బారులు తీరిన చిన్నారులు

పాఠశాల పాతభవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. దీంతో అధికారుల సూచన మేరకు తరగతులను ఇతర భవనాల్లో నిర్వహిస్తున్నారు. గతేడాది రూ.కోటి నిధులతో పాఠశాలకు నూతన భవనం నిర్మించారు. కానీ విద్యార్థులకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించకపోవడంతో తరగతులను నూతన భవనంలోకి తరలించలేదు. ప్రస్తుతం పాఠశాలలో 65 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు.

మూడు భవనాల్లో తరగతులు..

గ్రామంలో పాఠశాల పాత భవనం పక్కనే ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం భవనంలో మూడు తరగతి గదులు, అద్దెకు తీసుకున్న రెండు ప్రైవేటు షటర్లలో రెండు తరగతులు, పంచాయతీ కార్యాలయం పాత భవనంలో ఓ గదిని పాఠశాల ఆఫీస్‌రూంగా, మరో గదిని విద్యార్థుల కోసం వినియోగిస్తున్నారు.



ప్రారంభానికి నోచుకోని నూతన భవనం

విద్యార్థులకు తప్పని కష్టాలు..

పాఠశాలకు నూతన భవనం పూర్తయినా విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. నూతన భవనంలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవనే కారణాలతో తరగతులను అందులోకి తరలించడం లేదు. దీంతో పాత భవనాలు, అద్దె షటర్లలో తరగతులను నిర్వహిస్తుండటంతో విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు ఇక్కట్లు పడుతున్నారు. గతేడాది పాఠశాలలో 30మంది విద్యార్థులు.. నలుగురు ఉపాధ్యాయులు ఉండగా.. ఈసారి విద్యార్థుల సంఖ్య 65 మందికి చేరింది. ప్రస్తుతం పంచాయతీ పురాతన భవనం వద్ద మూత్రశాల, మరుగుదొడ్డి ఉండడంతో విద్యార్థులు అక్కడికి వెళ్లి అవసరాలు తీర్చుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని నూతన భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

నర్సాపూర్ (జి): విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి ప్రణాళిక ప్రకారం చదవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. నర్సాపూర్ (జి)లోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలిస్తూ 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటివరకు పూర్తయిన సిలబస్‌పై సమీక్ష చేశారు. సామాన్యశాస్త్ర పాఠానికి సంబంధించిన పటాలను బోర్డుపై గీయించి, విద్యార్థుల అవగాహన స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థుల హాజరు శాతం, సిలబస్ పురోగతి, బోధన నాణ్యత వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు ఉపాధ్యాయులు, విద్యార్థులు పూర్తిహాజరు నమోదు కావాలని ఆదేశించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక ప్రణాళికతో వారిని మెరుగుపర్చాలని సూచించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా గతంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు వారం రోజుల్లో టైల్స్ వేయించాలని, డైనింగ్ హాల్, బాలురకు మూత్రశాలలు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించి పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కేజీబీవీ ఇంటర్ విద్యార్థిని నల్లోల్ల ష్లక్ష్య స్వయంగా గీసిన కలెక్టర్ చిత్రపటాన్ని వారికి అందించగా ఆమె ప్రతిభను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఈవో భోజన్న, మండల ప్రత్యేక అధికారి అంజి ప్రసాద్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంఈవో సాయన్న, ఎంపీడీవో పుష్పలత, ఎంపీవో తిరుపతిరెడ్డి, పీఆర్ ఏఈ క్రాంతి, హెచ్ఎం రవీంద్రకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కలెక్టర్ అభిలాష అభినవ్‌కు చిత్రపటం అందిస్తున్న కేజీబీవీ విద్యార్థిని ష్లక్ష్య

'భూభారతి'లో వేగం పెంచాలి

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని కలెక్టర్ అభిలాష అభినవ్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. భూభారతి, సాదా బైనామా, జనన-మరణ ధ్రువపత్రాలు, కులం-ఆదాయం-నివాస ధ్రువపత్రాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ఎలక్షన్ ఫారమ్ పెండెన్సీలు, ప్రజావాణి, సీఎం ప్రజావాణి, కాళేశ్వరం ప్రాజెక్ట్ 28వ ప్యాకేజీ, సదర్ మాట్ బ్యారేజ్ భూసేకరణ, ఇసుక అక్రమ రవాణా వంటి అంశాలపై సమీక్షించారు. ప్రతి మండలంలో భూభారతి దరఖాస్తులను వారానికోసారి సమీక్షించి పరిష్కరించాలన్నారు. భూభారతి వ్యవస్థలో సాంకేతిక సమస్యలతో జాప్యం జరిగితే, తక్షణమే సాంకేతిక సహాయం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని, సంబంధిత అర్జీదారులకు నోటీసులు జారీ చేసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి, వేగంగా ఫైనల్ చేయాలన్నారు. పౌరసేవల జారీలో వేగం అవసరమన్నారు. కుల, ఆదాయ, నివాస, జనన, మరణ ధ్రువపత్రాలు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి, పైస్థాయికి పంపాలన్నారు. అనంతరం భారీ వర్షాలు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సాయం అందించేందుకు ప్రత్యేక విపత్తు సహాయక కిట్లను తహసీల్దార్లకు అందజేశారు.

గోసంరక్షణ అందరి బాధ్యత

- గోసేవా విభాగం జిల్లా కన్వీనర్ అల్లాడి రవి

నిర్మల్‌ఖిల్లా: హైందవ సంస్కృతిలో గోవుకు అత్యంత ప్రాధాన్యం ఉందని, గోసంరక్షణ మనందరి బాధ్యత అని గోసేవ విభాగ జిల్లా కన్వీనర్ డాక్టర్ అల్లాడి రవి అన్నారు. జిల్లా స్థాయి గోవిజ్ఞాన పరీక్షలు పట్టణంలోని విజయ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాలస్థాయి విద్యార్థులకు గోవు ప్రాధాన్యత, సంరక్షణ, హైందవ ధర్మ సంస్కృతిలో ప్రాముఖ్యతను తెలియజేయాలనే లక్ష్యంతో గోవిజ్ఞాన పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఆయా పాఠశాల స్థాయిలో తొలి దశలో నిర్వహించిన పరీక్షల్లో ఎంపికైన 110 మంది విద్యార్థులు మంగళవారం రెండో దశ పరీక్షల్లో పాల్గొన్నారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించే మూడో దశ పరీక్షలను రాయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.లక్ష మొదటి బహుమతిగా, రూ. 50 వేలు ద్వితీయ బహుమతిగా, రూ.25 వేలు తృతీయ బహుమతిగా అందించనున్నట్లు వివరించారు. రాష్ట్రస్థాయిలో రాణించిన విద్యార్థులకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా జ్ఞాపిక, పురస్కారం, నగదు అందజేస్తారని వివరించారు.



జిల్లాస్థాయి పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పౌష్టికాహారం అందించాలి

లోకేశ్వరం: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలతోపాటు ఐదేళ్లలోపు చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ముధోల్ సీడీపీవో సరోజిని అన్నారు. పోషణమాసంలో భాగంగా మంగళవారం మండలంలోని గొడిసెరా, మన్మద్ గ్రామాల ఆలయాల్లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మీనా, ఉమ, పోషణ అభియాన్ అధికారి రోజా తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్, పాతతర్లపాడ్ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారం గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకముందు పట్టణంలోని విద్యానగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. టీచర్లు సుకన్య, గాయత్రి, జ్యోతి ఉన్నారు.



గొడిసెరాలో మాట్లాడుతున్న సీడీపీవో సరోజిని

సీపీఆర్‌పై శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: సీపీఆర్‌పై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందికి మంగళవారం శిక్షణ ఏర్పాటు చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్ సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో చేసే ప్రాణరక్షణ పద్ధతి సీపీఆర్ అన్నారు. శ్వాస ఆగిపోవడం లేదా హృదయం కొట్టుకోవడం ఆగిపోతే వెంటనే సీపీఆర్ ప్రారంభిస్తే వారి జీవితం తిరిగి ఇవ్వగల అవకాశాలు ఉంటాయన్నారు. సీపీఆర్ వైద్యులు, నర్సులు చేసేపని కాదని సాధారణ ప్రజలు కూడా నేర్చుకోవాలన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణం కాపాడడానికి సీపీఆర్ సులభమైనదన్నారు. జిల్లా వ్యాప్తంగా సీపీఆర్ అవగాహన కార్యక్రమాన్ని ఈనెల 13 నుంచి 17 వరకు చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆశిష్‌రెడ్డి, డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ సౌమ్య, జిల్లాలోని వైద్యాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజేందర్

సంక్షిప్త వార్తలు

పంటల వివరాలు నమోదు చేసుకోవాలి

లక్ష్మణచాంద: మండలంలోని రైతులు తాము సాగు చేస్తున్న పంటల వివరాలను రైతువేదికల్లోని ఏఈవోల వద్దకు నమోదు చేసుకోవాలని ఆయా క్లస్టర్ల ఏఈవోలు పవిత్ర, మౌనిక, సుష్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసుకోకుంటే పంటలు విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. కపాస్ కిసాన్ ఆప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

బాల్యవివాహాలు అడ్డుకోవాలి

లోకేశ్వరం: గ్రామాల్లో జరిగే బాల్యవివాహాలను అడ్డుకొని 1098 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని జిల్లా చైల్డ్ సొసైటీ కౌన్సిలర్ సుప్రియ అన్నారు. మంగళవారం మండలంలోని రాజూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలతో కలిగే దుష్పరిణామాలు, బాలల హక్కులపై అవగాహన విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్ఎం రేగుంట రాజేశ్వర్, జిల్లా చైల్డ్ సొసైటీ కౌన్సిలర్లు శ్రీదేవి, పద్మ, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రావు, శంకర్‌సింగ్, భోజన్న తదితరులు ఉన్నారు.

వసతిగృహం తనిఖీ

కుంటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతిగృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం నిల్వల రిజిస్టర్, పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ-కేవైసీ నమోదు పరిశీలన

తానూరు: ఉపాధి కూలీలు ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో శివలింగం సూచించారు. మంగళవారం తానూరులో ఉపాధికూలీల ఈ కేవైసీ ప్రక్రియ పరిశీలించారు. ఇతర గ్రామాలకు వెళ్లినవారికి సమాచారం ఇచ్చి ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు. టీఏలు గంగాధర్, రమణగౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆసుపత్రిలో పండ్లు పంపిణీ

ఖానాపూర్: లక్సెట్టిపేట ఎమ్మెల్యేగా 1967-72లో గెలిచి ఆంధ్రప్రదేశ్ రెండో ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన జోగినపల్లి వెంకట్‌నర్సింగ్‌రావు జయంతి మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన ఆయన బావమరిది మనవడు బెజ్జంకి వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మస్కాపూర్ వీడీసీ అధ్యక్షుడు అద్వాల శంకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొనికేని దయానంద్, నాయకులు సంతోశ్, రమేశ్, లక్ష్మీపతిగౌడ్, ప్రసాద్, అరుణ్, శోభన్ తదితరులున్నారు.

నేడు ఎస్పీ ప్రజావాణి

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట ఎస్పీ జి.జానకీ షర్మిల అందుబాటులో ఉంటారని కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల ఫిర్యాదుదారులు ఎస్పీని కలిసి తమ సమస్యలు విన్నవించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జింక పిల్ల అప్పగింత

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామ సమీపంలో పోలీసులకు దొరికిన జింక పిల్లను అటవీశాఖ అధికారులకు అప్పగించారు. మంగళవారం భైంసారూరల్ పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా కామోల్ వెళ్తుండగా రోడ్డు పక్కన జింక పిల్లను చూసి చెరదీశారు. అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వగా వారు వచ్చి జింక పిల్లను తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎస్సై సుమంజలి, ఏఎస్సై మారుతి, పోలీసులు సంతోష్, బిక్కు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

సోన్: మండలవ్యాప్తంగా బుధవారం నుంచి నవంబర్ 13వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి ఓం ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో మొదటిరోజు సిద్దులకుంట గ్రామంలో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. పశువైద్యాధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లోని గేదెలు, ఆవులు, గొర్రెలు, ఎడ్లు, మేకలకు టీకాలు వేస్తారని.. పోషకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

లోకేశ్వరం: భవిష్యత్‌ను నాశనం చేసే మత్తు పదార్థాల జోలికి యువత వెళ్లొద్దని నిర్మల్ ఆనందితా ఫౌండేషన్ చైర్మన్ వాడేకర్ లక్ష్మణ్ అన్నారు. మంగళవారం లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ పాటిస్తూ లక్ష్యం నిర్దేశించుకొని శ్రమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ విద్యార్థినులు, ప్రిన్సిపాల్ గామ్, కేజీబీవీ ప్రిన్సిపాల్ అనసూయ, అధ్యాపకులు, చిన్నయ్య, వినోద్, వెంకటేశ్ ఉన్నారు.

విద్యార్థికి సన్మానం

ముధోల్: మండలకేంద్రానికి చెందిన సిరిగిరి సాయినాథ్-అనిత దంపతుల కుమార్తె సౌమ్య నీట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఆదిలాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు పొందింది. దీంతో సౌమ్యను మంగళవారం గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో పోతన్న యాదవ్, శంకర్, ఫరూక్, భీమన్న తదితరులున్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి



కుంటాలలో నిర్మాణం పరిశీలిస్తున్న అధికారులు



సోన్ : మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో గోవింద్

కుంటాల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్.. సిబ్బంది ఆదేశించారు. మంగళవారం మండలంలోని విఠాపూర్, కుంటాల, ఓలా, రాజాపూర్‌తండా, వెంకూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకున్న వారికి వెంటవెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. మండలానికి 264 ఇళ్లు మంజూరవగా 150 ఇళ్లు నిర్మాణ దశలో, 24 గోడల స్థాయిలో, 85 పునాది స్థాయిలో, 11 స్లాబ్ స్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పరిశీలించారు. డీఎల్‌పీవో లక్ష్మణ్, ఎంపీడీవో అల్లాడి వనజ, ఎంపీవో ఎంఏ రహీంఖాన్, ప్రిన్సిపాల్ ఎర్రాజ్ రాజు, కార్యదర్శులు సతీశ్, ఉత్తం, యోగేశ్ తదితరులు ఉన్నారు.

సోన్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణపనులు వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ గోవింద్ అన్నారు. మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణం, మంజూరైన నిధులు, పనుల పురోగతి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఐకేపీ రుణం అందించి పనులు పూర్తి చేయించాలన్నారు. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో ముఖ హాజరు (ఎఫ్‌ఆర్‌ఎస్) అమలు చేసి హాజరు శాతం పెంచాలని ఎంఈవోకు సూచించారు. గ్రామాల్లో నిరక్షరాస్యత నిర్మూలనకు వయోజన విద్య తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేశ్, ఎంఈఓ పరమేశ్వర్, ఎంపీవో మహేందర్, ఏపీఎం, ఏపీవో, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తానూరు: లబ్ధిదారులతో మాట్లాడి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు సత్వరం పూర్తి చేసేలా చూడాలని ఎంపీడీవో నసీరొద్దీన్.. సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ఈ కేవైసీ ప్రక్రియను సత్వరం పూర్తి చేసేలా చూడాలని సూచించారు. ఈజీఎస్ ఏపీవో శివలింగం, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిధులు తిరిగి చెల్లించాలి

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ ఆలయ నిర్మాణ నిధులు దుర్వినియోగం అయ్యాయని.. సదరు మొత్తాన్ని కాంట్రాక్టర్ తిరిగి ఆలయానికి చెల్లించాలని బీజేపీ మండలాధ్యక్షుడు కాల్వ నరేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం అడెల్లి ఆలయం సమీపంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అడెల్లి ఆలయం పునర్నిర్మాణం కోసం రూ.6.60 కోట్ల నిధులు మంజూరు చేయగా.. మహాపోచమ్మ విగ్రహావిష్కరణకు కానుకల రూపంలో భక్తులు రూ.158 లక్షలు సమర్పించారన్నారు. ఈనిధులు కాంట్రాక్టర్‌కు అప్పగించడం వెనుక ఎవరి ప్రమేయం ఉందో చెప్పాలని ప్రశ్నించారు. అధికారులు, పాలకులు వివరాలు వెల్లడించకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సాహెబ్‌రావు, వీరయ్య, రాజేశ్వర్, నర్సయ్య, తిరుమలచారి, ప్రకాశ్, శేఖర్‌గౌడ్, భీమలింగం, రామారావు, దేవన్న ఉన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ మండలాధ్యక్షుడు నరేశ్

పంట కుప్పే పాన్పు

భైంసాటౌన్: ఆరుగాలం శ్రమించే రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఓ వైపు భారీవర్షాలు పంటలను దెబ్బతీయగా.. చేతికొచ్చిన కొద్ది దిగుబడిని మార్కెట్‌లో విక్రయిద్దామంటే, అధికారుల నిర్లక్ష్యం, వ్యాపారుల దోపిడీతో కర్షకులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం భైంసా మార్కెట్‌కు భారీగా సోయా పంట రాగా కొనుగోళ్లలో జాప్యం జరిగింది. వ్యాపారులు ధర తగ్గించి కొనడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో రాత్రి వరకు పంట తూకం జరుగగా కొందరు రైతులు పంట కుప్పలే వద్దే నిరీక్షించారు. తూకం కాకపోవడంతో ఇలా ఓ రైతు తన పంట కుప్ప వద్దే రాత్రంతా నిద్రించాడు.



పొంచి ఉన్న ప్రమాదం



నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి శివారులో 61వ జాతీయ రహదారి పక్కనున్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండటంతో ప్రజలు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు ఎత్తైన రాతిగద్దెలు నిర్మించి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించాలని రైతులు కోరుతున్నారు.